డిఎం అండ్ హెచ్ఒ పర్యటన

ప్రజాశక్తి-పాడేరు: మండలంలోని మినుములూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పలు గ్రామాలలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జమాల్ భాషా శనివారం పర్యటించారు. ఇరడా పల్లి సచివాలయం, మినుములురు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న డి.సంపాలను సందర్శించి రోగులను పరీక్షించారు. ఆరోగ్యంపై శ్రద్ధ వహించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని గర్భిణీలకు సూచించారు. మరిగించిన నీరు చల్లార్చి తాగాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.దోమ తెరలు వాడాలన్నారు. ప్రధాన రహదారి నుండి కరకపుట్టు, దొడిపల్లి మీదుగా రోడ్డు మార్గాన్న వెళుతున్న క్రమంలో దొడ్డిపల్లి సమీపాన ఆయన వాహనం బురద(మట్టి రోడ్డు) కూరుకుపోయింది. కొంత దూరం మోటారు సైకిలుపై ప్రయాణించి కాలినడకన నడుచుకుంటూ ఆయా గ్రామాలను సందర్శించారు.

పరీక్షిస్తున్న డిఎం అండ్ హెచ్ఒ

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

-రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకర్‌రావు-ఎండపల్లివలసలో కల్చరల్ ఫెస్ట్

చైర్మన్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-అరకులోయ: విద్యార్థిని, విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణిస్తేనే సమాజం అభివృద్ధి చెందుతుందని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డి. వి.జి. శంకర్‌రావు తెలిపారు. ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా పదవి బాధ్యతలు చేపట్టిన తొలిసారిగా అరకులోయను సందర్శించిన ఆయన ఎండపల్లి వలసలోని ఈఎంఆర్ఎస్‌లో నిర్వహించిన స్టేట్ లెవెల్ ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ కల్చరల్ ఫెస్ట్‌లో మాట్లాడారు. విద్యార్థులు సమాజం పట్ల అవగాహన కలిగి ఉండాలని ఆయన అన్నారు. ఉన్నత విద్యను అభ్యసిస్తే మంచి అభివృద్ధితో పాటు ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని, మంచి వ్యక్తిగా గుర్తింపు పొందవచ్చని ఆయన అన్నారు. తోటి వ్యక్తికి సహాయపడే వ్యక్తిత్వం కలిగి ఉండాలని సూచించారు.ప్రభుత్వం అందిస్తున్న సహాయ సహకారాలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.28 ఈఎంఆర్ఎస్ స్కూళ్లకు చెందిన కల్చరల్ ఫెస్ట్ అరకులో నిర్వహించడం అభినందనీయమన్నారు.తాను విద్యార్థి దశ నుండే పద్యాలు, కథలు, కవితలు రాసానని తెలిపారు.

ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ, గిరిజన ద్యార్థుల విద్యాభివృద్ధికి ముఖ్యమంత్రి వైయస్ జగన్ ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. గిరిజన విద్యార్థుల్లో మంచి ప్రతిభ ఉందని వాటిని ఉపయోగించుకొని పాఠశాలలకు, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, దేశానికి మంచి పేరు తీసుకుని రావాలని ఆయన సూచించారు, ఈనెల 28 వరకు నిర్వహించనున్న ఈ కల్చరల్ ఫేస్ట్ కి 14 ఈవెంట్స్ లు నిర్వహించనున్నారు. అనంతరం ఎస్టీ కమిషన్ చైర్మన్ డి.వి. జి. శంకర్రావుకు ఈ ఎం ఆర్ ఎస్ ఉపాధ్యాయ బృందం ఘనంగా సత్కరించారు. అరకులోయ ఈఎంఆర్ ఎస్.ప్రిన్సిపల్ భాస్కర్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఎస్టీ కమిషన్ సభ్యులు రామలక్ష్మి, లిల్లీ సురేష్, మెడికల్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ నర్సింగ్ రావు, అరకులోయ జడ్పిటిసి శెట్టి రోషిని, ఎంపీపీ ఉషారాణి, పద్మాపురం మేజర్ పంచాయతీ సర్పంచ్ సుస్మిత, ఎంపీటీసీ దురియ ఆనంద్ కుమార్, వైసిపి రాష్ట్ర సోషల్ మీడియా ప్రతినిధి తడబారికి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మొర్రిగుడలో డయేరియా

- కెజిహెచ్‌లో ఒకరు మృతి

- అరకు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మరొకరు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండలంలోని కిల్లోగుడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి గసభ పంచాయితీ మొర్రిగుడ గ్రామంలో నాలుగైదు రోజుల నుంచి డయేరియా విజృంభిస్తోంది. దీంతో, వాంతులు, విరేచనాలకు గురై వంతల లివు(34) అనే గిరిజనుడు విశాఖపట్నం కేజీహెచ్ లో చికిత్స పొందుతూ శనివారం చెందగా, పాంగి కొత్తు (50) అరకులోయ ఏరియా హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. గత ఏడాది కూడా ఇదే గ్రామంలో డయేరియాతో ఆరుగురు మృతి చెందగా మరో వంద మందికి పైగా చికిత్స పొంది కోలుకున్నారు. దీంతో, మళ్లీ గత ఏడాదిలాగే మరింత మంది ఈ వ్యాధికి గురయ్యే ప్రమాదం ఉంటుందేమోనని గిరిజనులు తీవ్ర భయందోళనకు గురవుతున్నారు. ఆ గ్రామంలో గత యేడాది డయేరియా వ్యాప్తి చెందడానికి కారణమేంటన్న దానిపై కింగ్ జార్జ్ హాస్పిటల్ నుంచి వైద్య నిపుణులు సందర్శించి, ఆ గ్రామస్తులు ఉపయోగిస్తున్న మంచి నీటితో పాటు పలు రకాల నమూనాలను సేకరించి పరీక్షించి పరిశీలించి మరచి పోయారని ఆ పంచాయతీ మాజీ సర్పంచ్ పి.సురేష్ కుమార్, గ్రామస్తులు అంటున్నారు. స్థానిక ఎమ్మెల్యే ఫాల్గుణ, అప్పటి ఐటీడీపీఓ రోణంకి గోపాలకృష్ణ గ్రామంలో సందర్శించి ఆర్వో ప్లాంట్ నిర్మించి సురక్షిత తాగునీరు అందిస్తామని ప్రకటించారు. ఇప్పటికి నిర్మించలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి యేడాది ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం స్పందించి పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆ పంచాయతీ మాజీ సర్పంచ్ సురేష్ కుమార్, గ్రామస్తులు కోరుతున్నారు.

లివు మృతదేహం

పశువైద్య కేంద్రాల ఏర్పాటుకు వినతి

ప్రజాశక్తి-అనంతగిరి: మండలంలోని బొర్రా, పిన్నకోట పంచాయితీ కేంద్రాలలో కొత్త పశువైద్య కేంద్రాల ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ స్థానిక జెడ్పిటిసి దీసరి గంగరాజు, ఎంపీపీ శెట్టి నీలవేణిలకు మండల పరిషత్ కార్యాలయం వద్ద జిల్లా పశు వైద్య శాఖ సంఘం అధ్యక్షులు గణేశ్వరరావు విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పిన్నకోట గ్రామీణ పశు వైద్య కేంద్రం పరిధిలో కివర్ల, పెద్దకోట, పిన్నకోట, బొర్రా గ్రామీణ పశు వైద్య కేంద్రం పరిధిలో. టోకూరు, బొర్రా, కొండిబా, కోనాపురం పశు వైద్య కేంద్రం ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలని, ఉన్న భవనాల మరమ్మతు పనులు చేపట్టాలని కోరారు. స్పందించిన నేతలు అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు అశోక్,. సన్యాసిరావు, కో ఆప్షన్ సభ్యులు షేక్ మదీనా తదితరులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు

ప్రజాశక్తి-అనంతగిరి: పశువులకు, మేకలకు లంపి చర్మ వ్యాధి సోకకుండా ముందస్తుగా వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నామని కాశిపట్నం పశు వైద్యాదికారి సాగిరి గణేష్శ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తురు పంచాయతీ గ్రామలలో శనివారం ప్రత్యేక పశువైద్య శిబిరాలు ఏర్పాటు చేశా మన్నారు. 124 పశువులకులకు లంపి చర్మ వ్యాధి నిరోధక టీకాలు వేశా మన్నారు. పశువులు అనారోగ్యానికి గురైతే తక్షణమే సచివాలయ పశు సహాకులకు తెలియజేయాలని సూచించారు.

టీకాలు వేస్తున్న వైద్యులు

మాట్లాడుతున్న ఎంపిపి కారం లక్ష్మి, చిత్రంలో సిపిఎం సర్పంచ్‌లు, ఎంపిటిసి

ఆర్థిక సంఘం నిధులు పంచాయతీలకు ఇవ్వాలి

ఎంపిపి కారం లక్ష్మి, సర్పంచ్‌లు

ప్రజాశక్తి-విఆర్.పురం

కేంద్రం ఇచ్చిన 14, 15 ఆర్థిక సంఘం నిధులను తక్షణమే పంచాయతీలకు ఇవ్వాలని ఎంపిపి కారం లక్ష్మి, పలువురు సర్పంచ్‌లు డిమాండ్ చేశారు. స్థానిక ఎంపిపి కార్యాలయంలో శనివారం వారు విలేకర్లతో మాట్లాడుతూ మండలంలో గ్రామాల అభివృద్ధి పూర్తిగా పడకేసిందన్నారు. సరైన రోడ్లు లేక వర్షం కురిస్తే ప్రజలు నడవలేని పరిస్థితి ఉందని తెలిపారు. రోడ్లన్నీ గుంతలు పడడంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముంపు ప్రాంతమని చెప్పి అభివృద్ధి పనులు నిలిపివేయడం దారుణమన్నారు. సిపిఎం సర్పంచ్‌లు పూనెం సరోజిని, కారం బుచ్చమ్మ, వెట్టి లక్ష్మి, ఎంపీటీసీ పూనెం ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ గాంధీజీ గ్రామ స్వరాజ్యం కోరుకుంటే, జగన్‌రెడ్డి గ్రామ వినాశకానికి నాంది పలుకుతున్నాడని విమర్శించారు. జగన్‌రెడ్డి మాదిరిగానే తాము కూడా ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధులమేనని, ప్రజలకు ఇచ్చిన మాటా నీలా మేము కూడా నిలబెట్టుకోవాలని తెలిపారు. గ్రామాల అభివృద్ధికి కేంద్రం ఇచ్చే నిధులు దారి మళ్లించడం దారుణమన్నారు. కనీస నిధులు లేక సర్పంచులు అవమానాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం నుంచి వచ్చే ప్రతి రూపాయినీ తన అవసరాలకు దారిమళ్లించేస్తున్నారని, దీంతో గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడి, సర్పంచులు దోషులుగా నిలబడాల్సి వస్తోందని పేర్కొన్నారు. వెంటనే ప్రభుత్వం వాడుకున్న ఆర్థిక సంఘం నిధులన్నీ పంచాయతీలకు ఇచ్చి గ్రామాల అభివృద్ధికి సహకరించాలని కోరారు.

అందరి సహకారంతోనే అభివృద్ధి

ప్రజాశక్తి-అనంతగిరి: ప్రజాప్రతినిధులు, అధికారులు పరస్పర సహకారంతోనే మండల అభివృద్ధి సాధ్య పడుతుందని జెడ్పిటిసి దీసరి గంగరాజు, ఎంపీపీ శెట్టి. నీలవేణిలు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద స్థానిక ఎంపీపీ శెట్టి. నీలవేణి అధ్యక్షతన శనివారం సర్వసభ్య సమావేశం జరిగింది. రైతులకు రాజ్మా విత్తనాలు, యూరియా పంపిణీ సక్రమంగా జరగలేదని స్థానిక వ్యవసాయ శాఖ అధికారులకు వారు నిలదీశారు. 10 కేజీల రాజ్మా చిక్కుళ్ళకు సబ్సిడీ కింద 154 రూపాయలు చెల్లించవలసి ఉన్నప్పటికీ అనంతగిరి పంచాయతీ లోని రూ.250 వసూలు చేశారని తెలిపారు.మరికొన్ని పంచాయతీలలో రూ.350 వ్యవసాయ శాఖ సిబ్బంది వసూలు చేశారన్నారు. మండలంలో రాజ్మా చిక్కుళ్ళు ఎన్ని కింటాళ్లు, ఎంత మేరకు వచ్చాయని ప్రశ్నించగా సంబంధిత ఏవో సరైన సమాధానం చెప్పకపోవడంతో మండిపడ్డారు.విద్య, వైద్యం మరింత మెరుగు పరిచేందుకు క్షేత్రస్థాయి సిబ్బంది పని చేయవలసిన అవసరం ఉందని సూచించారు. తాగునీరు, రహదారి వంటి సమస్యల పట్ల సంబంధిత శాఖ అధికారులు దృష్టి పెట్టవలసిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశానికి శాఖల అధికారులు హాజరు కాకుండా కిందిస్థాయి సిబ్బంది హాజరు కావడంపై జిల్లా కలెక్టర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయాలని సభలో తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఇన్చార్జి ఎంపీడీఓ కుమార్, మండల పరిషత్ ఏఓ లక్ష్మీనారాయణ, ఇన్చార్జి ఈఓపి ఆర్‌డి, ఏటిడబ్ల్యూఓ వెంకటరమణ, పశు వైద్య శాఖ అధికారి ఎస్.గణేశ్వరరావు, వైస్ ఎంపీపీలు శకుంతల, జయవర్ధని, ఎంపిటిసిలు, సర్పంచులు కె.మొస్య, జె. అప్పారావు, రూతు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జెడ్‌పిటిసి గంగరాజు

పెదబయలులో భారీ వర్షం

దెబ్బతిన్న కాఫీ భవనం

ప్రజాశక్తి-పెదబయలురూరల్: మండలంలో శనివారం భారీ వర్షం కురిసింది. వర్షానికి మండల కేంద్రంలో మండల పరిషత్ సముదాయంలోని శిథిలావస్థలో ఉన్న కాఫీ భవనం దూలం విరిగి పోవటంతో ఒక్కసారిగా కూలి రేకులు విరిగిపడ్డాయి. ఆ సమయంలో ఆఫీసులో ఎవరు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

దెబ్బతిన్న భవనం రేకులు

రాజకీయ పార్టీలతో సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ శుభం బన్సల్

ఓటర్ల సర్వే 61 శాతం పూర్తి

- సబ్ కలెక్టర్ శుభం బన్సల్

ప్రజాశక్తి-రంపచోడవరం

ఇంటింటి ఓటర్ సర్వే ఇప్పటి వరకు 61 శాతం పూర్తయిందని రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్ తెలిపారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో వివిధ పార్టీల నాయకులతో శనివారం డోర్ టు డోర్ ఓటర్ సర్వే అంశంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ మిగిలి ఉన్న ఓటర్ సర్వే రెండు మూడు రోజుల్లో పూర్తి చేయాలని బూత్ లెవెల్ అధికారులకు సూచించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎం.ఈశ్వరరావు (వైసిపి), బి.ప్రసాద్ (సిపిఎం), ఎస్.బొజ్జి రెడ్డి, చుక్క సంతోష్ కుమార్ (బిజెపి), పి.అనంత మోహన్ (టిడిపి), ఎన్నికల డిప్యూటీ తహశీల్దారు ఎన్‌వి సత్యనారాయణ, సీనియర్ నాయకులు లక్ష్మణరావు పాల్గొన్నారు.

కూరగాయలు తీసుకొచ్చిన గిరిజనులు

కూరగాయల ధరలు పతనం

ప్రజాశక్తి-హుకుంపేట: మండల కేంద్రంలో శనివారం జరిగిన వారపు సంతలో ముల్లంగి దుంపలకు, వంకాయలు, క్యాబేజీ తదితర కూరగాయలు ధర పతనం కావడంతో రైతులు ఉసూరుమన్నారు. మారుమూల ప్రాంతాల్లో కష్టపడి పండించి వారపు సంతలో అమ్మకానికి తీసుకుని గిరిజనులు వచ్చారు. కూరగాయలను వ్యాపారస్తులు కొనుగోలు చేయక పోవడంతో నష్టపోయామని రైతులు వాపోయారు.కూరగాయలు పండించే రైతులకు ప్రభుత్వం కనీసం మద్దతు ధర ప్రకటించాలని కోరారు.

వైసిపిలో పదవుల పోరు

-ఎమ్మెల్యే ఫాల్గుణను నిలదీసిన నాయకులు

ప్రజాశక్తి - హుకుంపేట: మండలంలోని వైసిపి సీనియర్ నాయకులకు పదవులు కేటాయించక పోవడంతో నిరసనస సెగలు వెల్లువెత్తాయి. శనివారం మండల కేంద్రంలోని వైసిపి పార్టీ కార్యాలయం వద్ద నూతనంగా జిల్లా ఉపాధ్యక్షులకు అభినందన సభ ఏర్పాటు వచ్చిన ఎమ్మెల్యే పాల్గుణకు సీనియర్ నాయకులు పదవులపై నిలదీశారు. సొంత డబ్బులు పెట్టుబడి పెట్టుకుంటున్నా ఏ పదవులు కట్టబెట్టక పోవడంతో ఎమ్మెల్యేతో గండేరు చిన్న సత్యం వాగ్వాదానికి దిగారు. పార్టీ బలోపేతానికి కృషి చేసి పార్టీ నేతలకు పదవులు ఇవ్వకపోవడంతో పోరు మొదలైంది. ఎమ్మెల్యే తన కుటుంబ సభ్యులకి పదవులు కేటాయిస్తున్నట్లు పలువురు నేతలు ఆరోపించారు.

రాజ్‌మా విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి- పెదబయలు: మండలంలో అడుగుల పుట్టు రైతు భరోసా కేంద్రంలో శనివారం రైతులకు రాజ్‌మా విత్తనాలు పంపిణి చేశారు. ఈ సందర్భంగా జడ్పిటీసీ బొంజు బాబు మాట్లాడుతూ, 300 క్వింటాళ్ల రాజ్‌మా విత్తనాలు ఆయా గ్రామాల్లోని వ్యవసాయ సహాయకులతో పంపిణి చేయడం జరుగుతు ందన్నారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ, ఎస్ఐ పులి మనోజ్ కుమార్, వైస్ ఎంపీపీ కొర్ర రాజబాబు, సీనియర్ నాయకులు గంపరాయి సూరయ్య పాల్గొన్నారు.

పంపిణీ చేస్తున్న జెడ్‌పిటిసి

డుంబ్రిగుడ: మండలంలోని కొర్రాయి పంచాయతీలో సర్పంచ్ పి.కొములు, కంద్రుమ్ పంచాయితీలో సర్పంచ్ ల ఫోరం మండల అధ్యక్షుడు కే.హరి ఆధ్వర్యంలో శనివారం ప్రభుత్వం 90 శాతం సబ్సిడీతో అందించిన రాజ్ మా విత్తనాలను గిరి రైతులకు పంపిణీ చేశారు.. కొర్రాయిలో అరకు సర్కిల్ ఇన్స్పెక్టర్ రుద్ర శేఖర్ పాల్గొని రైతులకు విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం అందించే విత్తనాలను గిరి రైతులు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని సూచించారు. సమాజానికి కీడు కలిగించే గంజాయి, నాటు సారా వంటి జోలికి పోకుండా, ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న కాపీ, మిరియాలు, కూరగాయలతో పాటు ఇతర పంటలపై దృష్టి సారించి అభివృద్ధి చెందాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్సై సంతోష్ కుమార్, వైస్ ఎంపీపీలు పి.లలిత, ఎస్.ఆనంద్, వార్డు సభ్యులు కొగేశ్, లక్ష్మణ్, శోభన్ బాబు, ఎం కృష్ణ పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్

ప్రజాశక్తి-విఆర్.పురం

మండలంలో ప్రధాన రహదారుల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని సిపిఎం రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పన్ కిరణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని సిపిఎం కార్యాలయంలో పంకు సత్తిబాబు అధ్యక్షతన శనివారం జరిగిన పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ విఆర్.పురం నుండి చింతూరు వెళ్లే ప్రధాన రహదారి గోతులమయంగా మారిందన్నారు. పెద్దమట్టపల్లి-కుందులూరు రోడ్డు నిర్మాణానికి నాలుగేళ్ల క్రితం ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు శంకుస్థాపన చేశారని, ఆ రోడ్డును తవ్వేసి వదిలేశారని తెలిపారు. రేఖపల్లి- పోచవరం రహదారి మొత్తం గోతులు పడ్డాయని, రేకపల్లి-చొక్కనపల్లి రోడ్డు పూర్తిగా పాడైపోయిందని, వాహనాలు తిరగలేని పరిస్థితి ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేసి పాడైపోయిన రోడ్లకు మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు. గోదావరి వరదలకు ప్రజలకు ఇబ్బంది కాకుండా ప్రత్యామ్నాయ రోడ్లు అయిన కోతులుగుట్ట నుండి బోదునూరు మీదుగా ఏడుగురాళ్లపల్లి వరకు, కుందులూరు నుండి తులసిపాక గ్రామం వరకు కొత్త రోడ్లు మంజూరు చేసినట్లు కూనవరం పర్యటనలో ముఖ్యమంత్రి చెప్పారని, వాటికి కూడా తక్షణమే నిధులు విడుదల చేసి పనులు చేపట్టాలని కోరారు.

మాట్లాడుతున్న సిపిఎం రంపచోడవరం జిల్లా కార్యదర్శి కిరణ్, చిత్రంలో పార్టీ నాయకులు

1 నుండి నిరసన కార్యక్రమాలు

పెరిగిన విద్యుత్ ఛార్జీలకు వ్యతిరేకంగా సెప్టెంబర్ 1వ తేదీన నిరసన కార్యక్రమాలు, 4న మండల తహశీల్దార్ కార్యాలయం ముందు అధిక ధరలకు వ్యతిరేకంగా ధర్నాలు నిర్వహిస్తున్నామని, వీట్లో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కిరణ్ పిలుపునిచ్చారు. విద్యుత్ ఛార్జీలు, నిత్యవసరాల ధరలు పెరుగుదలతో సామాన్యుడు బతకలేని స్థితి నెలకొందన్నారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా నాయకులు పూనెం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, సర్పంచులు పులి సంతోష్ కుమార్, సవలం మారయ్య, ఎంపిటిసి పూనెం ప్రదీప్ కుమార్, నాయకులు పోడియం శ్రీరామ్మూర్తి, కుంజ నాగిరెడ్డి, కదల కొండారెడ్డి, ఖాదర్, వడ్లాది రమేష్, శీరపు తాతబాబు, గుండుపూడి లక్ష్మణరావు, కారం సుందరయ్య, కారం సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.



రాజ్‌మా విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎంపిపి రమేష్, జెడ్‌పిటిసి నూకరాజు

రాయితీపై రాజ్‌మా విత్తనాలు

ప్రజాశక్తి-కొయ్యూరు

మండల వ్యవసాయ శాఖాధికారి కార్యాలయంలో రాజ్‌మా విత్తనాలను ఎంపీపీ బడుగు రమేష్ శనివారం రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ గిరిజన రైతులకు 90 శాతం సబ్సిడీపై రాజ్‌మా విత్తనాలు పంపిణీ చేస్తున్నామని, వీటిని రైతులు వినియోగించుకోవాలని సూచించారు. మండల వ్యవసాయ అధికారి ఉమాదేవి మాట్లాడుతూ మండలంలోని ఐదు రైతు భరోసా కేంద్రాలకు 103 క్వింటాళ్ల విత్తనాలను తెప్పించినట్లు చెప్పారు. మంప ఎస్సై లోకేష్ కుమార్ రైతులు గంజాయి సాగు చేసే పొలాల్లో రాజ్‌మా సాగు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి వారా నూకరాజు, సర్పంచులు, ఎంపీటీసీలు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

వరద బాధితులకు నిత్యావసర సరుకుల పంపిణీ

ప్రజాశక్తి-విఆర్.పురం

ఎఎస్‌డిఎస్ సంస్థ, అజిమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ సహకారంతో వరద బాధితులకు నిత్యావసర సరుకులు శనివారం పంపిణీ చేశారు. ధర్మాతాళ్లగుడెం గ్రామంలో 159 కుటుంబాలకు, చొక్కనపల్లిలో 234 కుటుంబాలకు, కలుత్తునూరులో 94 కుటుంబాలకు అందించారు. ఈ సందర్భంగా ఎఎస్‌డిఎస్ సంస్థ అధినేత వి.గాంధీబాబు మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాల సమయంలో తమ సంస్థ ఎప్పుడూ ముందుండి ఇక్కడి ప్రజలకు సహాయ సహకారాలు అందిస్తుందని చెప్పారు. ఈ సంవత్సరం గోదావరి, శబరి నదుల వరదల కారణంగా ఇండ్లు మునిగిన వారికి డ్రై రేషన్ కిట్స్ అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ మేనేజర్ రాజ్ కుమార్, కో-ఆర్డినేటర్ టిఎస్ఎస్.సుబ్రహ్మణ్యం, ఎఎస్‌డిఎస్ సిబ్బంది రవి, తోడం రాజు. నాగమణి, జ్యోతి, సౌజన్య, పూజిత, హరి పాల్గొన్నారు.

నిత్యావసరాలు అందిస్తున్న ఎఎస్‌డిఎస్ సభ్యులు

ఘనంగా మదర్ థెరిసా జయంతి వేడుకలు

ప్రజాశక్తి-అడ్డతీగల

మదర్ థెరిసా జయంతి సందర్భంగా మండల కేంద్రంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ఉన్న మదర్ థెరిసా విగ్రహానికి సర్పంచ్ పప్పుల చిట్టెమ్మ, సాక్షి స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ ఆరోగ్య రాజ్ పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1910 ఆగస్టు 26న యుగోస్లేవియా అనే దేశంలో పుట్టి, మనదేశంలో కలకత్తాలోని మురికివాడల్లో పేదలకు అనేక సేవా కార్యక్రమాలు చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జైభీమ్ నాయకులు జగడం వెంకటేశ్వరావు, జనసేన నాయకులు జయరాం, కాంగ్రెస్ నాయకులు దెంగేటి సత్తిబాబు, సాక్షి స్వచ్ఛంద సేవ సంస్థ ప్రతినిధి సీనియర్ జర్నలిస్ట్ చోడిశెట్టి సుబ్బారావు, సురేష్ బాబు, సూరపరెడ్డి సత్యనారాయణ, శ్యామ్ పాల్గొన్నారు. అనంతరం ఎంపీపీ స్కూల్ పిల్లలకు చాక్లెట్లు పంపిణీ చేశారు.

మదర్ థెరిసా విగ్రహానికి పూలమాల వేస్తున్న సర్పంచ్ చిట్టమ్మ, సాక్షి సంస్థ ప్రతినిధులు

కొడుకు చేతిలో తండ్రి హతం

ప్రజాశక్తి-చింతూరు

మండలంలోని ఏడుగురాళ్లపల్లి పంచాయతీ పరిధి లంకపల్లి గ్రామంలో కొడుకు చేతిలో తండ్రి హత్య గాబడిన సంఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... గ్రామానికి చెందిన పోడియం లక్ష్మయ్య అలియాస్ లక్మ (40), తన కొడుకు అర్జున్ వ్యవసాయ పనులను చూడకుండా బయట తిరుగుతుండడంతో మందలించాడు దీంతో అర్జున్ కోపంతో తండ్రి లక్ష్మయ్య తలపై కర్రతో బలంగా కొట్టాడు. దీంతో లక్ష్మయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చింతూరు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

విద్యుత్ సర్వీసులకు ఆధార్ అనుసంధానం చేసుకోవాలి

ప్రజాశక్తి-ఎటపాక

విద్యుత్ వినియోదారులు తమ విద్యుత్ సర్వీసు నెంబర్లకు ఆధార్ అనుసంధానం చేయించుకోవాలని విద్యుత్‌శాఖ జెఇ గెల్లంకి రాజ్‌కపూర్ శనివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఎపిఈపీడీసీఎల్ వెబ్‌సైట్, గ్రామ సచివాలయం, విద్యుత్ బిల్ కలెక్టర్, రెవెన్యూ క్యాషియర్ (విద్యుత్) ద్వారా తమ ఆధార్‌ను విద్యుత్ సర్వీసుకు ఈ నెల 28లోగా అనుసంధానం చేయించుకోవాలని సూచించారు.

మణిపూర్ మారణకాండపై నిరసన

ప్రజాశక్తి -ములగాడ : మణిపూర్‌లో మహిళలపై జరుగుతున్న దౌర్జన్యాలకు వ్యతిరేకంగా మల్కాపురంలోని నవజ్యోతి పరస్పర సహాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యాన శనివారం ర్యాలీ, అనంతరం సమావేశం నిర్వహించారు. ర్యాలీని నవజ్యోతి మాక్స్ డైరెక్టర్ సిస్టర్ సంగీత ప్రారంభించి మాట్లాడారు. మణిపూర్‌లో మహిళలను నగ్నంగా ఊరేగించడం అమానుషమని, నాగరిక సమాజం దీనిని ఖండించాలని పేర్కొన్నారు. మనిషికి మనిషికి మధ్య మానవత్వం ఉండాలని, కుల మతాలు కాదని అన్నారు. జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారి ఇపిఎస్.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ, మణిపూర్‌లో ఖుకీలకు, మైథిలకు మధ్య జరుగుతున్న పోరాటం దేశాన్ని అనైక్యతకు గురి చేస్తోందని అన్నారు. ఎక్కడ మారణహోమం జరిగినా చివరకు బలయ్యేది మహిళలే అని, ఈ పరిస్థితి మారాలని పేర్కొన్నారు. మహిళలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ సేవా పథకం సీనియర్ ప్రోగ్రామ్ అధికారి వై.అనసూయదేవి, యానిమేటర్లు వెంకటలక్ష్మి, మేరీ, సుశీల, విజయ, హేమలత, తులసి తదితరులు పాల్గొన్నారు. సమావేశానికి ముందు ర్యాలీ నవజ్యోతి మ్యాక్స్ నుంచి హాస్పిటల్ వరకు కొనసాగింది.

ముఖ్య అతిథులను సత్కరిస్తున్న గీతం ప్రతినిధులు

గీతం ఐఇఇఇ విద్యార్థి విభాగం సమావేశం

ప్రజాశక్తి-మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని ఎలక్ట్రానిక్స్ అండ్ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగం విద్యార్థులు సభ్యులుగా గల ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఎలక్ట్రికల్ ఇంజినీర్స్ (ఐఇఇఇ) పవర్ ఇంజినీర్స్ సొసైటీ విద్యార్థి విభాగం శనివారం సమావేశమైంది. ఈ సమావేశానికి ఐఐటి భువనేశ్వర్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.శ్రీనివాస్ భాస్కర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్, కృత్రిమ మేధకు సంబంధించిన అంశాలపై లోతైన పరిజ్ఞానం ఉన్నవారికి భవిష్యత్తులో డిమాండ్ ఏర్పడనున్నదని తెలిపారు. సాఫ్ట్‌వేర్ రంగంలో వారికంటే ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ చదివి ఆర్టిఫిషియల్ ఇంటెలిజన్స్‌పై పట్టు ఉన్నవారు ఎక్కువ అవకాశాలు పొందుతారని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విద్యుత్తు వాహనాల అభివృద్ధి, విండ్, సోలార్ ఎనర్జీ, బయోగ్రాస్ విధానంలో విద్యుత్తు ఉత్పాదన రంగాలలో అభివృద్ధిని వివరించారు. సంప్రదాయేతర ఇందన వనరులను నూతన టెక్నాలజీ జోడించి అభివృద్ధి చేయడం ద్వారా భవిష్యత్తులో విద్యుత్తు కొరతను నివారించవచ్చన్నారు. కార్యక్రమానికి గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ ప్రిన్సిపల్ డాక్టర్ కె.నాగేంద్రప్రసాద్ అధ్యక్షత వహించగా ఇఇఇసిఇ విభాగం అధిపతి డాక్టర్ జెబి.సెవెన్త్‌లైన్, ఐఇఇఇ విద్యార్థి విభాగం కౌన్సిలర్ డాక్టర్ మహ్మద్ కెఎమ్.చిష్టి తదితరులు పాల్గొని ప్రసంగించారు.

శంకరమఠంలో శబరిమల సమాచార కేంద్రం

ప్రజాశక్తి-సీతమ్మధార : శబరిమల ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు ఆధ్వర్యాన దక్షిణ భారతదేశంలోనే మొట్టమొదటి సమాచారం కేంద్రాన్ని విశాఖపట్నం శంకరమఠంలో శనివారం ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు అధ్యక్షులు అనంతగోపన్ శనివారం ప్రారంభించారు. అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచారసభ సహకారంతో శంకరమఠం, ట్రావెన్‌కోర్ దేవస్థానంబోర్డు ఒప్పందంతో ఈ సమాచార కేంద్రం ఏర్పాటు చేసినట్లు అనంతగోపన్ తెలిపారు. ఈ కేంద్రంలో వసతి గదులు, వర్చువల్ క్యూ లైన్, పూజలు, ప్రత్యేక కార్యక్రమాలు వంటి సమాచారం లభ్యమవుతాయని పేర్కొన్నారు. శబరిమలలో 600 గదులు భక్తుల కోసం ఉన్నాయని, వాటిలో 120 గదులు ఆన్‌లైన్ ద్వారా పొందవచ్చని చెప్పారు.

అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచారసభ, పూర్ణపుష్కళ ట్రస్ట్ ఆధ్వర్యాన నవంబరు 24, 25 తేదీలలో అయ్యప్ప మహాసంగమం నిర్వహించనున్నట్లు అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచారసభ జాతీయ అధ్యక్షుడు కె.అయ్యప్పదాసు, పూర్ణపుష్కళ ట్రస్ట్ చైర్మన్ పైల ఆదిమోహన్‌రెడ్డి తెలిపారు.

భీమిలి నియోజకవర్గంలో పార్లమెంటరీ బృందం పర్యటన

భూముల రీ సర్వే పరికరాలను పరిశీలిస్తున్న పార్లమెంటరీ బృందం సభ్యులు

ప్రజాశక్తి- పద్మనాభం, ఆనందపురం : పద్మనాభం మండలం రెడ్డిపల్లిలో పార్లమెంటరీ బృందం చైర్‌పర్సన్ కరుణానిధి కనిమొళి ఆధ్వర్యాన శనివారం పర్యటించింది. రెడ్డిపల్లి గ్రామ సచివాలయాన్ని సందర్శించారు. ప్రజలకు అందుతున్న సేవలపై సచివాలయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం డ్వాక్రా మహిళలతో ముఖాముఖి సమావేశం ఏర్పాటు చేశారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలు అందుతున్న తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. రెండు గ్రూపులకు చెందిన ఇద్దరు మహిళలు వారి అనుభవాన్ని సభలో వివరించారు. ఈ కార్యక్రమానికి ముందు రెడ్డిపల్లిలో 2.5 ఎకరాల్లో పండించిన సపోటా తోటను పరిశీలించారు. ఎంపిపి రాంబాబు, జెడ్‌పిటిసి సభ్యులు ఎస్.గిరిబాబు. ఎంపిడిఒ విజయ్‌కుమార్, తహశీల్దార్ శ్రీవల్లి, జిల్లా, మండల అధికారులు పాల్గొన్నారు.

ఆనందపురం : ఆనందపురం మండలంలో 25 మంది సభ్యులతో కూడిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ శనివారం అభివృద్ధి పనులను పరిశీలించింది. శొంఠ్యాం గ్రామ పంచాయతీ పరిధి రామ్‌సాగర్, అమృత సరోవర్ ట్యాంకులను పరిశీలించారు. గ్రామ ప్రజలతో మాట్లాడి పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం చందక గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న జగ్గురాజుపాలెం వద్ద భూముల రీ సర్వేకు సంబంధించిన డ్రోన్లు, పరికరాలు, ల్యాండింగ్ స్కెచ్‌లు, ఎగ్జిబిషన్‌లో ఉన్న పరికరాలను పరిశీలించారు. పిఎంజిఎస్‌వై రోడ్లును పరిశీలించారు. రైతులకు వ్యవసాయ రుణాలు, వివిధ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సర్వే శాఖ ఏడీ కె.సూర్యారావు, ఎస్ఇ బిఎస్.రవీంద్ర, పీడీ డిడబ్ల్యుఎమ్ ఎ.సందీప్, భీమిలి ఆర్‌డిఒ భాస్కరరెడ్డి, మండల పరిపాలనాధికారి అడపా లవరాజు, తహశీల్దార్ లోకవరపు రామారావు పాల్గొన్నారు.

దీర్ఘకాలిక సమస్యలపై దీక్ష, వంటావార్పు

ప్రజాశక్తి -ములగాడ : తూర్పు నావికా దళంలో పనిచేస్తున్న కార్మికులు, ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలపై డిఫెన్స్ కో-ఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యాన రెండు రోజులు దీక్ష, వంటా వార్పు కార్యక్రమాన్ని తూర్పు నౌకాదళ ప్రధాన కార్యాలయం ఎదుట నిర్వహించారు. ఈ సందర్భంగా డిఫెన్స్ కో-ఆర్డినేషన్ కమిటీ చైర్మన్ రెడ్డి వెంకటరావు మాట్లాడుతూ, కమాండ్ పరిధిలోని దీర్ఘకాలిక సమస్యలు, వైద్య సదుపాయాలు, హెచ్‌ఆర్‌ఎపై ఓటీ, ఇంక్రిమెంట్లు, పే ఫిక్సేషన్స్ సత్వరమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళన కార్యక్రమానికి వివిధ ట్రేడ్ యూనియన్లు సంఘీభావం తెలిపాయి. ఈ కార్యక్రమంలో ఎన్‌సిఇ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు జి.మారుతి, పి.నాగేశ్వరరావు, తూర్పు నౌకాదళంలోని ఎన్ఎడి సిఇ యూనియన్, ఎస్‌బిసిసిఇ యూనియన్, ఎంఇఎస్‌సి యూనియన్, ఎన్ఎస్‌టిఎల్‌సిఇ యూనియన్ ప్రతినిధులు, ఉద్యోగులు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని సంఘీభావం తెలియజేశారు.

సంఘీభావం తెలుపుతున్న కార్మిక సంఘాల నేతలు

ఎయులో ఇండస్ట్రీ 4.0 సెంటర్

సమ్రుత్ ఉద్యోగ్ టెక్నాలజీ ఫోరం ప్రతినిధులను సన్మానిస్తున్న వీసీ తదితరులు

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్రవిశ్వవిద్యాలయంలో ఇండస్ట్రీ 4.0 కేంద్రం ఏర్పాటు కానుంది. భారత ప్రభుత్వ భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖకు అనుబంధంగా పనిచేసే సమ్రుత్ ఉద్యోగ్ టెక్నాలజీ ఫోరం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ సదాశివ్ పాఢి, ఆపరేషన్స్ విభాగాధిపతి రాజేష్ పహాడిలు ఆంధ్రవిశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. ఏయూలో ఇండస్ట్రీ 4.0 కేంద్రం ఏర్పాటుకు అనువైన ప్రాంతం, భవనాలు తదితర అంశాలను పరిశీలించడానికి వచ్చారు. ఈ సందర్భంగా వీరు ఏయూలో ఇప్పటికే నిర్వహిస్తున్న పలు స్టార్టప్ సంస్థల పనితీరు పరిశీలించి, నిర్వాహకులతో మాట్లాడారు.

ఎయు వీసీ ఆచార్య పివిజిడి.ప్రసాదరెడ్డితో పాలక మండలి సమావేశ మందిరంలో ఫోరం ప్రతినిధులు సమావేశమయ్యారు. త్వరలో కేంద్ర మంత్రిత్వశాఖ అనుమతి తీసుకొని ఎయులో సెంటర్‌ను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఎయు ఐపిఆర్ చైర్ ప్రొఫెసర్ డాక్టర్ హనుమంతు పురుషోత్తం ఎయులో రూ.3 కోట్ల వ్యయంతో ఇండస్ట్రీ 4.ఓ ఏర్పాటుకు అవసరమైన ప్రాజెక్ట్ రిపోర్ట్‌ను తీర్చిదిద్ది అందించారు. కార్యక్రమంలో ఎయు రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ఎయు ఇంక్యుబేషన్ సెంటర్ సిఇఒ రవి ఈశ్వరపు, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి ఆచార్య పి.మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతినిధులను వర్సిటీ తరపున సత్కరించారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో ఇంజినీరింగ్ విద్యార్థి మృతి

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక బీచ్ రోడ్డు ఐఎన్ఎస్ కళింగ సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇంజినీరింగ్ విద్యార్థి మృతి చెందాడు. మరో ఇద్దరు విద్యార్థులు గాయపడ్డారు. భీమిలి పోలీసుల కథనం ప్రకారం.. గీతం కళాశాల సిఎస్ఇ థర్డ్ ఇయర్ చదువుతున్న కిర్లంపూడి లే అవుట్, లాసెన్స్ బే కాలనీకి చెందిన పెండ్యాల ప్రఖ్యాత్ (20), సీతమ్మధారకు చెందిన కోలా అఖిలేష్, ఎండాడకు చెందిన ఆర్.సాయిలక్ష్మి భీమిలి నుంచి విశాఖ వైపుగా కారులో వస్తున్నారు. ఐఎన్ఎస్ కళింగ సమీపంలోకి వచ్చేసరికి కారు అదుపు తప్పి ఎడమ వైపున ఉన్న చెట్టుకు ఢీకొట్టింది. దీంతో కారు ముందుభాగం నుజ్జు నుజ్జు అయింది. ఈ ప్రమాదంలో కారు డ్రైవ్ చేస్తున్న పెండ్యాల ప్రఖ్యాత్ (20) తలకు బలమైన గాయాలయ్యాయి. అతని స్నేహితులు కోలా అఖిలేష్, ఆర్.సాయిలక్ష్మికి స్వల్ప గాయాలయ్యాయి. తీవ్ర గాయాలతో రక్తపు మడుగులో ఉన్న ప్రఖ్యాత్‌ను చికిత్స నిమిత్తం స్నేహితులు గీతం ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. బ్రేక్ ఫాస్ట్ నిమిత్తం ముగ్గురు కారులో భీమిలి వెళ్లి తిరుగు ప్రయాణంలో ప్రమాదానికి గురయ్యారు. ఎస్ఐ భరత్‌కుమార్‌రాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

138 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్:ముందస్తు సమాచారం మేరకు నర్సీపట్నం మండలం నెల్లిమెట్ట సమీపంలో ఇతర ప్రాంతాలకు తరలించేందుకు సిద్ధంగా ఉంచిన 138 కిలోల గంజాయిని పట్టుకున్నట్లు రూరల్ సీఐ రమణయ్య పేర్కొన్నారు. నర్సీపట్నం రూరల్ పోలీస్ స్టేషన్లో శనివారం రాత్రి విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముందస్తు సమాచారం మేరకు రూరల్ ఎస్సై తన సిబ్బందితో కలిసి నెల్లిమెట్ట సమీపంలో దాడులు చేశారన్నారు. మెయిన్ రోడ్డును ఆనుకుని ఉన్న మట్టి రోడ్‌లో బొలెరో వ్యాన్‌లో 138 కిలోల గంజాయిని కారులోకి మారుస్తుండగా స్వాధీనం చేసుకున్నామన్నారు. ఆరుగురుపై కేసు నమోదు చేసి, వారి వద్ద నుంచి రూ.1,02,600ల నగదు, ఏడు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్టు ఆయన వివరించారు.

బెల్ ఎన్నికల గుర్తులు కేటాయింపు

ప్రజాశక్తి -గాజువాక : బిహెచ్ఇఎల్‌లో ఈ నెల 31న నిర్వహించే గుర్తింపు సంఘం ఎన్నికలకు సంబంధించి శనివారం గుర్తులు కేటాయించారు. ఐఎన్‌టియుసి, సిఐటియు ఫ్రంట్‌కు, ఉదయించే సూర్యుడు, యునైటెడ్ ఫ్రంట్‌కు సింహం గుర్తు, బిఎంఎస్‌కు కాగడా గుర్తులు ప్రకటించారు. మొత్తం మూడు ప్యానళ్లు పోటీలో ఉన్నాయి.

విధి నిర్వహణలో అలసత్వం వద్దు

ప్రజాశక్తి-సీతమ్మధార : టౌన్ ప్లానింగ్ సెక్రటరీలు విధి నిర్వహణలో అలస్తత్వం ప్రదర్శించకుండా ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చేలా నడుచుకోవాలని జోన్-3 కమిషనర్ వై.విజయలక్ష్మి సూచించారు. కార్యాలయంలో సచివాలయ సిబ్బంది, టౌన్ ప్లానింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రీ సర్వేలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. భవన నిర్మాణదారులు జివిఎంసి నుంచి పొందిన ప్లాన్ అప్రూవల్ ప్రకారం నిర్మాణాలు జరిగేలా చూడాలని, బిల్డింగ్ నిర్మాణాలు చేస్తున్న యాజమాన్యాలు వ్యర్థాలను డంపింగ్ యార్డుకు తరలించేలా చూడాలని సూచించారు. అనంతరం రీ సర్వేకు సంబంధించి ట్యాబ్‌లను ప్లానింగ్ అధికారులకు ఆమె అందజేశారు ఈ సమావేశంలో ఎసిపి శాస్త్రి టిపిఒ తేజ, ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

నవోదయ ప్రవేశాల గడువు పొడిగింపు

ప్రజాశక్తి -పిఎం పాలెం : కొమ్మాది సమీపంలో ఉన్న జవహర్ నవోదయ విద్యాలయంలో రానున్న విద్యాసంవత్సరంలో ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకునే గడువును మరోసారి పొడిగించారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 31వ తేదీలోపు www.nvs.gov.in వెబ్‌సైట్‌లోని లింక్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. విశాఖ జిల్లాలోని ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో ప్రస్తుతం 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని నవోదయ పాఠశాల ప్రిన్సిపల్ కె.సంజయ్ తెలిపారు. ఆధార్ చిరునామా లేనివారు జిల్లాలో నివసిస్తున్నట్టు నివాస ధ్రువీకరణ పత్రం అప్‌లోడ్ చేసి రిజిష్టర్ చేసుకోవచ్చనని పేర్కొన్నారు.

వేడుకల ఏర్పాట్లు వివరాలు వెల్లడిస్తున్న గోపీనాథ్ రెడ్డి

ఎపిఎల్, ఎసిఎ ప్లాటినం జూబ్లీ వేడుకలకు సర్వం సిద్ధం

- నేడు 1983 వరల్డ్ కప్ హీరోలు విశాఖకు రాక

ప్రజాశక్తి - పిఎం.పాలెం : ఎపిఎల్, ఎసిఎ ప్లాటినం జూబ్లీ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఎసిఎ కార్యదర్శి ఎస్ఆర్.గోపీనాథ్ రెడ్డి వెల్లడించారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా 1983 క్రికెట్ వరల్డ్ కప్ హీరోలు రానున్నట్లు తెలిపారు. శనివారం పిఎం.పాలెంలోని క్రికెట్ స్టేడియం ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎసిఎ జాయింట్ సెక్రటరీ రాకేష్‌తో కలిసి గోపీనాథ్ రెడ్డి పలు విషయాలు వెల్లడించారు. ఎసిఎ అధ్యక్షులు పి.శరత్ చంద్రారెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలోని యువ క్రికెటర్లలో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి వారికి గొప్ప అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో గత ఏడాది ఎపిఎల్ - 1ను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించామన్నారు. ఆ స్ఫూర్తితో ప్రస్తుతం సీజన్ - 2 చేపట్టామని తెలిపారు. ఆదివారం విశాఖలోని డాక్టర్ వైఎస్ఆర్ ఎసిఎ - విడిసిఎ స్టేడియంలో జరగనున్న ఎపిఎల్ ఫైనల్‌కు మాజీ ఇండియా టెస్ట్ కెప్టెన్, బిసిసిఐ సీనియర్ సెలక్షన్ కమిటీ మాజీ ఛైర్మన్ కృష్ణమాచారి శ్రీకాంత్, అదేవిధంగా గౌరవ అతిథిగా మాజీ ఇండియా క్రికెటర్, ఇండియా నేషనల్ క్రికెట్ కోచ్ మదన్ లాల్ హాజరవుతారని వెల్లడించారు. ఎపిఎల్ ఫైనల్ మ్యాచ్‌ను చూసేందుకు ఐపిఎల్ టీం స్కౌట్స్ వచ్చారని, దీంతో యువ క్రీడాకారులకు భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. ఎసిఎ ప్లాటినం జూబ్లీ వేడుకలకు ముఖ్య అతిథిగా బిసిసిఐ ప్రెసిడెంట్ రోజర్ బిన్నీ, గౌరవ అతిథిగా మాజీ ఇండియన్ క్రికెటర్, ఇండియా నేషనల్ క్రికెట్ కోచ్ మదన్ లాల్ హాజరవుతారని తెలిపారు. మాజీ మెన్, ఉమెన్ రంజీ ప్లేయర్లు, కెప్టెన్లు, ఎసిఎ సిబ్బందితో ముఖాముఖి నిర్వహిస్తారని వెల్లడించారు. తొలి భారత టెస్ట్ కెప్టెన్, ఆంధ్ర రంజీ ట్రోఫీ జట్టుకు మొదటి కెప్టెన్ కల్నల్ సికె.నాయుడు కుటుంబ సభ్యులను సన్మానిస్తామని తెలిపారు. బిసిసిఐ ప్రెసిడెంట్ రోజర్ బిన్నీ వైజాగ్ రావడం వల్ల రాష్ట్రానికి గుర్తింపు ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా స్టేడియం ప్రాంగణంలో ఎసిఎ మాజీ కార్యదర్శి ఎన్.వెంకటరావు పేరిట స్టాండ్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

టౌన్ ప్లానింగ్‌లో పలువురికి ఉద్యోగోన్నతులు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో : జివిఎంసి పట్టణ ప్రణాళిక విభాగంలో పలువురు అధికారులకు ఉద్యోగోన్నతులు కల్పించి వివిధ ప్రాంతాలకు శనివారం బదిలీ చేశారు. అసిస్టెంట్ డైరెక్టర్ నుంచి డిప్యూటీ డైరెక్టర్ హోదాతో ఉద్యోగోన్నతి కల్పించి అసిస్టెంట్ సిటీ ప్లానర్‌గా పనిచేస్తున్న కె.వెంకటేశ్వరరావును విఎంఆర్‌డిఎకు ప్లానింగ్ ఆఫీసర్‌గా బదిలీ చేశారు. మరో అసిస్టెంట్ సిటీ ప్లానర్‌గా పనిచేస్తున్న కె.జయరాంను విశాఖపట్నంలో ఉన్న రీజినల్ డిప్యూటీ డైరెక్టర్‌గా నియమించారు. గాజువాక ఎసిపిగా పని చేస్తున్న సంపూర్ణ మహాపాత్రను బొబ్బిలి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీకి బదిలీ చేయగా, అనకాపల్లి ఎసిపిగా పనిచేస్తున్న అరుణవల్లిని రాజమండ్రి రీజనల్ డిప్యూటీ డైరెక్టర్‌గా బదిలీ చేశారు. ఇక జివిఎంసిలో టిపిఒలుగా పనిచేస్తున్న శ్రీలక్ష్మి, రామకృష్ణలకు అసిస్టెంట్ సిటీ ప్లానర్ హోదా కల్పిస్తూ జివిఎంసిలోనే పోస్టింగ్ ఇచ్చారు. వీరితో పాటు మరో ఇద్దరు జివిఎంసికి రానున్నారు. బొబ్బిలిలో పనిచేస్తున్న ఎస్.వెంకటేశ్వరరావుకు ఎసిపిగా ఉద్యోగోన్నతి కల్పించి జివిఎంసిలో నియమించగా, నందిగామలో పనిచేస్తున్న ఝాన్సీ రాణిని ఎసిపిగా ఉద్యోగోన్నతి కల్పించి జివిఎంసిలో పోస్టింగ్ ఇచ్చారు.

నళిని, కమలినిలకు వైశాఖి జీవన సాఫల్య పురస్కారం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రసిద్ధ కథక్ నృత్య కళాకారులు, పద్మశ్రీ పురస్కార గ్రహీతలు నళిని, కమలిని సోదరీమణులు 'వైశాఖి జీవన సాఫల్య పురస్కారం-2023'కు ఎంపికయ్యారు. 15వ వార్షిక వైశాఖి నృత్యోత్సవం సందర్భంగా కళాభారతి ఆడిటోరియంలో సెప్టెంబర్ 15 నుంచి 17 వరకు జరిగే కార్యక్రమంలో అతిథులు, నిర్వాహకుల చేతులమీదుగా ఈ పురస్కారాన్ని వారు స్వీకరించనున్నారు.

పల్లెను పట్టిన దోమ

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

స్థానిక సంస్థలను.. ప్రధానంగా పంచాయతీలను కొంతకాలంగా ప్రభుత్వాలు ఆర్థికంగా బలహీనపరుస్తూ రావడంతో వస్తున్న దుష్ఫలితాలిప్పుడు ఆందోళన కలిగిస్తున్నాయి. నిర్ణయ పర్యావసానంపై విధానకర్తలకు స్పష్టతలేకపోయినా, వున్నా ముడుకుమెడ్డుతో వెళ్లిపోయినా ఆ ప్రభావం ఎలా పడుతుందో ఇప్పుడు పంచాయతీలను చూసినవారెవరికైనా అర్థమవుతుంది.

సీజనల్ వ్యాధులు ప్రబలే ఈ కాలంలో వాటిని నియంత్రించడానికి చర్యలు చేపట్టే పరిస్థితి పంచాయతీలకు లేకుండా ప్రభుత్వం చేసింది. గతంలో 14వ ఆర్థిక సంఘం నిధులను విద్యుత్ బిల్లులకు జమచేసినట్లే, ఈ ఏడాదీ 15వ ఆర్థిక సంఘం నిధులను వాటికి జమచేసి ఆర్థిక వనరుల్లేని దుస్థితిని తీసుకొచ్చింది. పల్లెల్లో పేరుకుపోయిన చెత్తను తీయించడానికి, తీసిన పారిశుధ్య కార్మికులకు జీతాలు చెల్లించడానికి, మలేరియా, డెంగీ, టైఫాయిడ్ వంటి వ్యాధులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవడానికి అవకాశం లేకుండా పంచాయతీలను తయారు చేసింది. డబ్బుల్లేక ఈ పనులేమీ చేయలేని పంచాయతీల్లో ఇప్పుడు డెంగీ, మలేరియా వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయి. బ్లీచింగ్ కొనడానికి కూడా పైసల్లేని పంచాయతీలు జిల్లాలో బోలెడువున్నాయి. పంచాయతీల్లో చిన్నపాటి పనులు చేసేందుకు కూడా డబ్బుల్లేక ఇబ్బందులు పడుతున్నామని కొద్ది రోజుల క్రితం సర్పంచ్‌లంతా వీధుల్లోకి వచ్చారు. పంచాయతీలకొచ్చే 15వ ఆర్థిక సంఘం నిధులను విద్యుత్ బిల్లులకు మళ్లించడంపై నిరసన తెలిపారు.

దోమల సమూహాలను నియంత్రించ లేకపోవడంతో ఇపుడవి మనుషులపై దాడిచేసి వ్యాధుల పాల్జేస్తున్నాయి. పారిశుధ్యంపై కొనసాగుతున్న నిర్లిప్తత వ్యాధులు ప్రబలడానికి దారితీసింది. వైద్య, ఆరోగ్యశాఖ గణాంకాల ప్రకారం అనకాపల్లి జిల్లాలో 2022 జులై 31 నాటికి 110, విశాఖపట్నం జిల్లాలో 352 డెంగీ కేసులు నమోదైతే, ఈ ఏడాది జులై 31 నాటికి అనకాపల్లి జిల్లాలో 145, విశాఖపట్నం జిల్లాలో 516కు పెరిగాయి. అనకాపల్లి జిల్లాలో గతేడాది 38 మలేరియా కేసులు నమోదైతే ఈ ఏడాది 85కు పెరిగాయి. విశాఖలో గతేడాది 20 మలేరియా కేసులుండగా, ఈ ఏడాది 67కు పెరిగాయి. ఇప్పటికైనా పెరుగుతున్న డెంగీ, మలేరియా కేసులను పరిగణనలోకి తీసుకొని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పారిశుధ్య పనులు చేపట్టేందుకు అవసరమైన నిధులను ప్రభుత్వం విడుదల చేయాలి. నిధుల సమస్యలేని చోట సత్వరమే పనులు జరిగేలా ప్రభుత్వ యంత్రాంగం చూడాలి. ఒకవైపు వ్యాధులు వ్యాప్తి చెందకుండా ముందు జాగ్రత్తలు తీసుకుంటూనే, మరోవైపు ప్రభుత్వ ఆసుపత్రుల్లో సకాలంలో సరైన సేవలందించేలా ఏర్పాట్లు చేయాలి. అవసరమైన మందులను సిద్ధం చేయాలి.

స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుంటాం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ దీనిని ప్రైవేటీకరిస్తే అంగీకరించేది లేదని స్టీల్‌ప్లాంట్ హెచ్ఎంఎస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి జి.గణపతిరెడ్డి అన్నారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు శనివారానికి 875వ రోజుకు చేరాయి. దీక్షల్లో హెచ్ఎంఎస్ యూనియన్ నాయకులు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకునేందుకు ఎంతటి త్యాగాలకైనా సిద్ధంగా ఉన్నామన్నారు.

జిఎంఐఎస్ కోసం 28న డిసిఐ రోడ్ షో

నౌకాయాన అభివృద్ధికి 'గేట్ వే'గా అక్టోబర్ 17 -19 మధ్య గ్లోబల్ మారిటైం సమ్మిట్

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఈ ఏడాది అక్టోబర్ 17 నుంచి 19 వరకూ న్యూఢిల్లీలోని ప్రగతి మైదానంలో గ్లోబల్ మారిటైం ఇండియా సమ్మిట్ - 2023ను కేంద్ర పోర్టులు, నౌకాయాన, జల రవాణా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నేపథ్యంలో విశాఖలో డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (డిసిఐ) ఈ నెల 28న రోడ్ షో నిర్వహించనుంది. ఈ క్రమంలో నగరంలోని సీతమ్మధార, హెచ్‌బి కాలనీలోగల ఆ సంస్థ నూతన కార్పొరేట్ కమ్యూనికేషన్స్ కార్యాలయంలో ఈ ఈవెంట్‌ను వర్చువల్‌గా నిర్వహించేందుకు డిసిఐ అధికారులు, ఉద్యోగులు సన్నాహాలు చేస్తున్నారు. వెరసి 'అంతర్జాతీయ సముద్ర వేడుక'కు డిసిఐ వేదిక కానుంది. వైజాగ్ పోర్టు అథారిటీ (విపిఎ) ఛైర్మన్ డాక్టర్ మధయ్యాన్ అంగముత్తు, డిసిఐ మేనేజింగ్ డైరెక్టర్, సిఇఒ కెప్టెన్ ఎస్.దివాకర్ నేతృత్వంలో ఈ వర్చువల్ రోడ్ షో జరుగనుంది. ఈ సమ్మిట్ అంతర్జాతీయంగా నౌకాయాన పురోగతికి, కొత్త వనరుల అధ్యయనానికి ఎంతగానో దోహదపడుతుందని, సముద్ర తీర వ్యాపార బలోపేతానికి, పారిశ్రామికీకరణకు అవసరమైన బూస్టింగ్ ఇస్తుందని డ్రెడ్జింగ్ కార్పొరేషన్, పోర్టు అధికారులు వెల్లడిస్తున్నారు.

బ్లూ ఎకానమీ దిశగా భారత్

ఢిల్లీలో అక్టోబర్ 17 నుంచి 3 రోజుల పాటు జరుగనున్న ఈ సమ్మిట్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో పాటు నౌకాయాన రంగంలో ఉన్న పారిశ్రామిక వేత్తలు సైతం భాగస్వాములు కానున్నారు. పోర్టులు, తీర ప్రాంతం గుండా వ్యాపార లావాదేవీలు సాగించే వారంతా ఈ సమ్మిట్‌కు హాజరవుతున్నారు. దేశం బ్లూ ఎకానమీ దిశగా అడుగులు వేస్తుందని, సముద్రయాన రంగంలో వృద్ధిని సాధించడం, దేశంలో పోర్టుల కనెక్టివిటీని పెంచడమే దీని లక్ష్యమని షిప్పింగ్ మంత్రిత్వ శాఖ వెల్లడిస్తోంది.

ప్రపంచ వ్యాప్తంగా నౌకాయాన వ్యాపార సహకారం కోసం ఈ సమ్మిట్‌ను నిర్వహిస్తున్నట్టు చెబుతున్నారు. వాస్తవానికి సముద్రయాన రంగం (మారిటైం సెక్టార్) ఎంతో పురాతనమైనది. ఎంతో అభివృద్ధిని సాధించింది. అంతర్జాతీయ వాణిజ్యంలో సరికొత్త సాంకేతిక అంశాల కోసం తాజాగా అన్వేషణ సాగిస్తున్న సందర్భంలో ఈ సమ్మిట్ ఎంతగానో ఉపయోగపడే అవకాశముందని డిసిఐ, పోర్టు ఉన్నతాధికారులు భావిస్తున్నారు. ఈ సమ్మిట్‌లో సుమారు వంద దేశాలకుపైగా పాల్గొనే అవకాశం ఉందని తెలుస్తోంది. తీర ప్రాంతంలో జరుగుతున్న అభివృద్ధి పనుల ద్వారా ఆర్థిక అవకాశాలను సృష్టించేందుకు ఈ సమ్మిట్ 'గేట్ వే' కానుందని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది.

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ మురళి సంతోష్

లోటస్‌లో అరుదైన శస్త్ర చికిత్సలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వైద్య చరిత్రలోనే విశాఖ లోటస్ హాస్పిటల్ ఫర్ వుమెన్, చిల్డ్రన్ ఎన్నో అరుదైన రికార్డులు సొంతం చేసుకుందని, ఈ క్రమంలో తల్లి, పిల్లల వైద్యంలో సరికొత్త అధ్యాయాన్ని సొంతం చేసుకుందని లోటస్ హాస్పిటల్ ఫర్ వుమెన్ అండ్ చిల్డ్రన్ చీఫ్ నీనటాలజిస్ట్, పీడియాట్రీషియన్ డాక్టర్ మురళీ సంతోష్ తెలిపారు. శనివారం ఉదయం విశాఖలోని ఫోర్ పాయింట్స్ హోటల్‌లో సక్సెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ గడిచిన తొమ్మి నెలల్లో తమ వైద్యుల బృందం 26 వారాల కంటే తక్కువ వయస్సు, చాలా తక్కువ బరువు ఉన్న 16 మంది శిశువులకు అరుదైన చిక్సితలను విజయవంతంగా అందించి 100 శాతం రికవరీ రేటును సాధించిందని వెల్లడించారు. చిన్నారుల తల్లిదండ్రులు మాట్లాడుతూ లోటస్ హాస్పిటల్స్ యాజమాన్యం, డాక్టర్ మురళీ సంతోష్, డాక్టర్ రమ్య, డాక్టర్ సంతోష్ కల్యాణ్ టీం సభ్యుల సేవలు తాము మరువలేమని చెప్పుకొచ్చారు. ఈ సక్సెస్ మీట్‌లో వైద్యులు డాక్టర్ రమ్య, డాక్టర్ సంతోష్ కల్యాణ్, డాక్టర్ శిరీషా రాణి, డాక్టర్ అనూష పాల్గొన్నారు.

మత్స్యకారుని ఆచూకీ కోసం ఆందోళన

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఈ నెల 21న ఫిషింగ్ హార్బర్‌లో బోట్ నెంబర్ 374లో ఏడుగురు మత్స్యకారులతో కలిసి చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు సముద్రంలో జారిపడి గల్లంతైన మత్స్యకారుడు మామిడిపల్లి అప్పన్న ఆచూకీ కనుగొనాలని, ఆయనను ప్రాణాలతో కాపాడాలని కోరుతూ శనివారం స్థానిక ఫిషింగ్ హార్బర్‌లోని మత్స్యశాఖ జెడి కార్యాలయం ఎదుట బాధిత కుటుంబ సభ్యులతో కలిసి మత్స్యకారులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఫిషింగ్ హార్బర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పి.చంద్రశేఖర్, అధ్యక్షుడు వజ్రం, డాల్ఫిన్ మెకనైజ్డ్ బోట్ ఆపరేటర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వాసుపల్లి జానకిరామ్ పాల్గొన్నారు.

డెంగీ నివారణపై అవగాహన

ప్రజాశక్తి - కలెక్టరేట్ : దేశాన్ని డెంగీ రహితంగా మార్చే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు డాబర్ ఇండియా లిమిటెడ్ మార్కెటింగ్ హెడ్ హోమ్ కేర్ సనత్ పులిక్కల్ తెలిపారు. 'మేకింగ్ ఇండియా డెంగీ ఫ్రీ' క్యాంపెయిన్‌లో భాగంగా పెదవాల్తేరులోని కెడిపిఎం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు శనివారం దోమకాటుపై అవగాహన కల్పించారు. వర్షాకాలంలో డెంగీ కలిగించే దోమల నుంచి తమను తాము రక్షించుకోవడానికి ఒడోమస్ దోమల నివారణ క్రీములను ఉచితంగా పంపిణీ చేశారు. వర్షాకాలంలో వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సంతోష్ జైస్వాల్, కెడిపిఎం ప్రిన్సిపల్ సుమతీబాయి పాల్గొన్నారు.

31లోగా మున్సిపల్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఈ నెల 31లోగా మున్సిపల్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని, టైం బాండ్ అగ్రిమెంట్ అమలు చేయాలని జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవ అధ్యక్షులు పి.వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శి యు.రాజు డిమాండ్ చేశారు. శనివారం జివిఎంసి చీఫ్ మెడికల్ ఆఫీసర్ కుమార్‌కు ఈ మేరకు వినతి పత్రం సమర్పించారు.

డ్యురియన్ ఫర్నీచర్ స్టోర్ ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : లగ్జరీ ఫర్నీచర్ బ్రాండ్ డ్యురియన్ ఫర్నీచర్ సంస్థ శనివారం విశాఖపట్నంలో తన నూతన స్టోర్‌ను ప్రారంభించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇదే తమ మొదటి స్టోర్ అని సంస్థ ప్రతినిధి తెలిపారు. రైల్వే డిఆర్ఎమ్ ఆఫీసు ఎదురుగా దొండపర్తిలో ఉన్న తమ స్టోర్‌లో అత్యుత్తమ ఫర్నీచర్ లభిస్తుందని నిర్వాహకులు కొంచాడ హరిప్రసాద్ తెలిపారు.